షి : వానిచాయ అడ్డువచ్చి యుండవచ్చు.

హి : వానిది అమెరికన్ చాయా ?

షి : కాదు. బ్రిటిషర్ చాయా ?

హి : కాదు.

మఱి ఆ యువతీ యువకులు వెనుదిరిగి చూచేలో ఆ కాళ్లురేని బెగ్గర్ వాళ్లులేనివానిలా మాయమైపోయినాడు !

.... .... .... .... ....

## వైతరణిలో బంగారు ఇసుక

మర్త్యుల్లో మార్కండేయస్వామి ఏలా లొంగలేదో యముడికి, అలా లొంగలేదు ఆ దంపతులు ఇద్దరూ పురపాలక సంఘం వారికి. ఎక్కడెక్కడున్న పూరిగుడిసెల్ని, పుట్టకొక్కుల్ని ఎక్కడీసి కనుక్కుని ఊడలాగి, పట్నంలో మరి ఛండాలము లేకుండా చేయాలని ఆ పురపాలక సంఘంవారి సంకల్పము. అయితే ప్రజలలో వుత్పన్నమయ్యే దురాక్రమణ బుద్ధి నెవరు మాన్పగలరు ? అంతేకాకుండా ఇంద్రధనస్సును మోసేవి, "శిలీంధ్రామ్ " పుట్టగొడుగులేనట ! మఱి చెప్పన్న ఓర్పు పూరిగుడిసెల్లో పుట్టి పెరిగే వాళ్ళదని ప్రతీతి ! అలాంటప్పుడు ఆ రెంటినీ ఊడపీకడం బ్రహ్మతరంగాదు. ఒకటి పేడనుబట్టి ఎదిగినా, మఱొకటి పెంటకుప్పను బలిసినా ! ఇక్కడ గుడిసె పీకేస్తే మఱొకచోట కనిపించుతారు ఆ దంపతులు ఖాళీగావున్న చోటు ఆక్రమించుకుంటూ !

కాస్తంత ఊపిరి చల్లగా పీల్చుకోవచ్చు అని పొరులు తలపోసేసరికి అక్కడే ప్రత్యక్షము వాళ్ళిద్దరూ ఒక చేట, ఒక కుండపెంకు, ఒక పాతచీపురూ పుచ్చుకు. "ఎక్కణ్ణుంచి అర్రా! వచ్చేరు" అనేసరికి "ఆ ముడుగుకాల్వ ఊడ్చి తెచ్చాము ఈ ముడుగుకాల్వ ఊడ్చితెచ్చాము బాదిబంద, దాన్ని కడిగి బంగారం చెయ్యాలి యింకా మేం! ఇది మా వృత్తి!" అని చతికిల బడేవారు ఏకాడో ఓకాడ! వాళ్ళను మరి కదప డానికి పెనుభూతమైనా రావాలి పెద్దపులైనా రావాలి. మనిషి అయినవాడు కదపలేడు.

అయినా లోకంలో వృత్తు లెన్నైనా వుంటాయి కాని అలాంటి వృత్తి నేను చూడలేదు. ఇంతకూ వాళ్ళకో తార్కికం లేకపోలేదు. "చేట వెల్లకితలా వుండగా పుడతాము. చేట మన బూడిదమీద బోర్లింపబడుతుంది. ఈ జగత్తు అంతా చేటలోనే వుంది. బోది చెప్పినా చేటతోనే, చెరిగినా చేటతోనే, శివాఅంటా ఎగరపోసినా చేటతోనే—అటువంటి చేటను మేం నమ్మాం!" అని వాళ్ళ వాదం. నిజమే కోటి విద్యలు కూటి కొఱకే! చేట నొకళ్ళు నమ్మేరు, కోట నొకళ్లు నమ్మేరు.

"హరిహరీ నారాయణాది నారాయణా!
కరుణించి మమ్మేలు కమలలోచనుడా!"

వెన్నెల పచ్చ పువ్వుల్లా కాస్తూవుంది. కార్తికమాస శుక్ల పక్ష త్రయోదశో చతుర్దశో అనుకుంటాను ఆ రాత్రి. ఒక అవిశెచెట్టు ఆరు బయట రోడ్డు కవల ఊళ్లో యిళ్ళమధ్య ఖాళీలో ఎఱ్ఱఎఱ్ఱగా తెల్లతెల్లగా కొన్ని రేకులిల్లాగ కొన్నిరేకు లల్లగ విడుతూంటే గాలి కూగుతూ, పువ్వు లెటుకు జాటు

సదురుకుంటూవున్న మత్తకాశివిలావుంది. దానికి అనతి దూరంలో మట్టిచెట్టు ఒకటి ఎఱ్ఱటి పళ్ళు కలిగి ముదురాకుపచ్చితో మిలమిల మంటూ వుంది. ప్రకృతి ఎంతో రంజకంగావుంది. పక్షికికూడా ఆ గడియప్పుడు నిద్రే! నిద్ర తప్పిస్తే కల!

నేను పైన వివరించానే, ఆ దంపతులు నివసించడానికి ఇల్లు లేదు, వాకిలిలేదు, ఊరికే బాటసారుల్లా ఈ పైనుంచి నిరంతరము నడుస్తూ ఉండవలసిందే. ఎక్కడైనా ఆగితే దురాక్రమణ చేస్తున్నారని అక్కడే వారిని పట్టుకునేరు.

అక్కడకు చాలా సేపు వాళ్ళు అలాగే తిరిగేరు చేత చేట చీపురు పుచ్చుకొని పెళ్ళాం. పగిలిపోయిన కుండపెంకు పుచ్చుకొని మగడు. ఆ మురుగు కాలవమీద వంగొంటూ, ఈ మురుగు కాలవవద్ద వంగొంటూ, ఏదో కడిగినట్టు. వడపోసినట్టు పాటు పడ్డారు. కాని ఎంత సేపు అని పాటుపడగలరు? వాళ్ళు ఒక ఘడియపాటైనా నిదురించాలి ఎక్కడో ఒకచోట. "ఇల్లిల్లే! పొలమిల్లే!" అరవం ఇంత అప్రయత్నంగా వ్రాశాము అంటే ఆ దంపతులు అరవలని వేరే చెప్పక్కరలేదు. అంతేకాకుండా భారత్ యూనియన్ అంతా ఒకే జాతి! అందువల్ల వాళ్ళను వెంటాడించ బుద్ధిఅయింది నాకు. కాని నేను మాత్రం ఎంత దూరమని వాళ్ళను వెంటాడించగలను? నేను వాళ్ళను అల్లంత దూరంలో వదిలాను. వాళ్లు మరి ఏమైనారో నాకు కనబడలే!

అయితే కధకు కనబడతారు. కధకు కళ్ళు వస్తాయి! కాళ్ళు వస్తాయి! ఒక్కొక్కప్పుడు!

వాళ్ళున్నారే ఆ దంపతులిద్దరూ అలా అలా, పూర్వోక్తపు మహా వెన్నెలలో ఆ అవిసిచెటును చేరుకోగలిగారు ఆ రాత్రి.

అవిసెచెట్టు మాను అట్టే స్థలము ఆక్రమించదు. దానిదో దురాక్రమణ కాబోదు. దాని క్రింద పడేళారు రాత్రి రెండో ఝాంవేళ తమ కుండపెంకు, పాతచీపురు, చేట. అంతేగా వారి సామాను ; వాళ్ళదిరీసు తల వెంట్రుకలు తప్పిస్తే విశేషించి చెప్పదగ్గదేమీలేదు ; తల వెంట్రుకలు దిరీసు అనుకుంటే కావు సహజమైనవే అనీ లోకం అంగీకరిస్తే తగువే లేదు. వాళ్ళకు దాచుకోదగ్గదేమీ లేదనే చెప్పవచ్చు.

మగవాడొక గోచీ పెట్టుకొన్నాడు. ఆడది ఒక ఏత్రాసి ఏకండీచీర కప్పుకుంది. ఇద్దఱకూ కళ్లు మూతలడిపోతున్నా యేమో పడుకున్న పాళంగా నిద్దరట్టిపోయింది. ఎక్కడ ఏసామాను పడేసుకున్నది వాళ్ళమతికానలే ! ఒకసారి తలగడ కోసం నెమకినట్టు కాబోలు వాడు చెయ్యి విసిరేడు. అది వత్తిగిలి గుత్తి అందించింది.

అదే సమయమప్పుడు ఆ అవిశెచెట్టుమీద రెండు రామ చిలుకలు వాలాయి. తెల తెల వాఱిపోతూవుంది. ఎఱ ఎఱ్ఱ అరుణోదయం అవుతూవుంది తూర్పెంపు. తిన్నగా చిలకలకు కనిపించాయి పాలవెల్లిని వేలాడుతూ వున్నట్టు అవిసెపూగుత్తులు చెట్టున వేలాడుతూ, ఆ చిలకలు రెండూ ఆ పువ్వుల్ని క్రిందకు రాలేటట్టు ముక్కుల్తో పొడిచాయి వృంతాల్లోకి. పువ్వులు రాలి క్రిందకుపడి యీ నిద్రపోతూన్న ఇద్దర్నీ, ఈ మనుష్య దంపతుల్ని కప్పివేసినాయి. పైచిలుకలు కూడా చూడలేక పోయినాయి అనుకొంటాను ఆ నగ్న స్వరూపాన్ని.

మనుష్య రూపాలు నఖశిఖపర్యంతము పూర్తిగా కప్పడి పోయినాక. పడ పువ్వులు ఆ మనుష్యులయొక్క నేలను.

చీపురును, మండిగను కప్పి పారేశాయి. ఇంతలో దండిగ తెల్లారింది. పదిమంది పోగుబడ్డారు. "పాపం! వీళ్ళు ఉండ డానికి వీడులేక చల్లోపడి చనిపోయినారులాగుంది!" అని ఒకళ్లు అంటే, ఒకళ్లు—"ఇన్నాళ్ళూ అక్రమంగా ఈ స్థలం ఆక్రమించుకు తుదకొక కానీలేకుండా చనిపొమ్మన్నా దెవరు?" అని యిల్లా ఆ గుమిగూడిన పౌరులు అనుకోసాగారు.

చట్టప్రకారము కటుకొకటికట్టి, వాళ్ళిద్దర్ని దహన పరిచారు పోలీసులు పంచాయితీచేసి, చలికి చనిపోయినారని తీర్మానించి. తరువాత వాళ్ళ ఆస్తిపాస్తి ఎంత వెదకినా ఆ చీపురు, ఆ మండిగ, ఆ చేట తప్ప ఏమీ కనిపించలేదు. వాటినికూడా ఆ యిరువురియొక్క దహనజ్వాలకు ఆహూతిచేస్తూ పరిపూర్ణ భస్మం కావించారు.

ఇగక్కడణ్నుంచి ప్రజానీకం ఆ అవిసెచెట్టు పడగొట్టి అదంతా సమస్తలం చేయడానికి మొదలుపెట్టారు. క్రింద పడివున్నవాటి వరులు పువ్వుల్ని తొత్త్ర్తోసి చూచారు ఒక మూలకు. దులిపారు ఒక్కటొక్కటే ఎదో ఆదుర్దా అంతలో తోచి, ఆపువ్వులయొక్క ఆరితీరీ మంచుతేనెనుండి విడజారి పడ్డట్టయింది. మెరుస్తూ ఒక ఇనుకరేణువు, రెండోది యిసుక రేణువే! మూడోది యిసుకరేణువే! మెఱుపుగీటుగిసి పరీక్షిస్తే అవన్నీ బంగారు యిసుకరేణువులు. ఆ బంగారు యిసుకరేణువు లెల్లావచ్చాయి. ఆ పూలరేకులవా? ఆ కొత్తగా వాలిన చిలకలవా? ఆ చనిపోయిన వాళ్ళ కృషి ఫలితానివా? ఇది తేలని ప్రశ్నగా మిగిలిపోయింది.

మళ్ళీ రాకపోతాయా చిలకలని మర్నాటిదాకా చెట్టును అపుచేసి చూచారుకాని, మర్నాడు చిలకలు రాల్చిన ఆ పూలకు

ఆ ప్రజ్ఞ లేకపోయింది. నిన్నటి చిలకలు మరి రావని ఒక నిర్ధారణకు వస్తూ ఆ అవిసెచెట్టు అవిసెచెట్టు అంతా కూలేలా గొడ్డళ్ళకొట్టారు కూలీలు ! గభీమని చెట్టుకూలింది.

కాని వెలుతురుకు బదులు చీకటి కమ్మింది, తొలుదొల్త. ఆ చీకటిగుండా ఆకాశంకేసిచూస్తే అది అంతా కొంతసేపు అతి నల్లగా కనుపట్టి రెండు తెల్లని గీతలమధ్య మళ్ళీ నల్లని ప్రవాహంలా కనిపించింది, నల్లని తాచులా మెలికలుతిరిగి నడుస్తూ. పోలిక్కంటే తాచులాగుంది కాని దాని కడుపులో మొసళ్లూ. తేళ్ళు, తిమింగిలాలు ఇంకా ఎన్నో క్రూరతరమైన అగాధ సరీసృపాలు అన్నీ ఉన్నాయి. బంగారం ఉంది. వెండి ఉంది. లోహాలు అన్నీ వున్నాయి చెప్పొద్దూ ! తేలి వెడుతున్న వానిలా కొన్ని, తైలం కళపెళా కాగుతూంటే అందులో కొట్టుమిట్టాడేవానిలా కొన్ని, కోరలు పెంచుక్కొన్ని, కోరలు సాచుకొన్ని వున్నాయి. ఇన్నింటినీ తప్పించుకు అడ్డంగా అస్తమానం తెల్లనిగోవు ఒకటి ఈ ఒడ్డునుంచి ఆ వొడ్డుకు ఏ అపాయం ఏ మొగమాటం లేకుండా నిర్మలంగా నడచిపోతూ వుంటుంది. దానితో కట్టుకు ఆత్మలు చచ్చిపోయినవాళ్ళ ఆత్మలు అవతల పారంకనేరు. అల్లాగే అనేక ఆత్మలు దాటుచున్న వ్యవహారకాండ గోచరింపసాగింది. ఆ తోక ఆ పట్టుకోవడంలో యీ ఆత్మలు చేసేపని ఏమిటా అంటే ఇటూ అటూ వెనక్కుడను ఏ జంతువును చూచికాని, ఏ జాతిని చూచికాని, ఏ మోళీ చూచికాని, ఏ జాకువా చూచికాని ! ఆ కొట్టుకొచ్చే నీళ్ళే వైతరణి ! ఆ నీళ్ళలో మెలికలు తిరిగి కొలికులు తెగి, కోతలుపడి ఘాతలుపడి నురుముఅయ్యే బంగారం అంతా యేమవుతుంది ?

కొట్టుకు కొట్టుకు వచ్చి వచ్చి చివరకు తనతోక తాను తినే పాములా అయిపోయి చుట్టచుట్టలుగా పెద్ద పెద్ద బంగారపు టిసుక మేటలువేస్తూ అదోరకం చిలకలకు నివాసస్థానమై యుంటుందట నది అంతా. నేనుమాత్రం చూచానా! పేర్ధు విన్నాను. వైతరణీ!

ఆ చిలకలు ఒక్కొక్కప్పుడు తమ పుట్టు రెక్కలమీద ఎగిరి నదిని దాటుకొచ్చి ముల్లోకాలు విహరించడం కద్దు. కాని కొట్టిపారేసిన చెట్టు మరి మొలవదు. కన్నుకు పట్టిన కుళ్ళంక మటీ తెలవదు. అందరూ కోరేరు వైతరణిలో బంగారు ఇసుక కాని ఆ యిరువురుకే దక్కింది అనేరు.

స మా ప్త ము.



రాజేశ్వర ప్రెస్, రాజమండ్రి.